క్లుప్తంగా

మర్యాద పూర్వకంగా..



కలెక్టర్ మాధవీలతను కలిసిన డీఎస్పీ అంబికా ప్రసాద్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీగా బదిలీపై వచ్చిన ఎం.అంబికా ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.

సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయండి

బిక్కవోలు: గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఈవోపీఆర్డీ భవానీ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలు ఏ విధంగా ఖర్చు చేయాలో వివరించారు. ప్రణాళిక తయారీపై పందలపాక సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్ అవగాహన కల్పించారు. అలాగే మండలంలో పాలవెల్లువ సర్వేను వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ భవానీ సూచించారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం

రాజానగరం: పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్రంలో ప్రభుత్వం పంపిణీ చేసిన నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. మహిళల పేరు మీద పంపిణీ చేసిన ఈ స్థలాలను వారి పేరునే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మండలంలో ఐదు వేల పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా, ఇప్పటికే మూడు వేలకు పైబడి పూర్తి చేశామని స్థానిక తహసీల్దార్ జి.నూకరాజు తెలిపారు. ప్రభుత్వపరంగా అన్ని లావాదేవీలు పూర్తి చేసి, పంపిణీ చేసిన స్థలాలకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామన్నారు. ఇక ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లాయంటూ వస్తున్న వార్తలపై స్పందించారు. మృతి చెందిన వారి పేర్లను కొన్నిచోట్ల తొలగించక పోవడంతోనే ఇటువంటి సమస్యలు వస్తున్నాయన్నారు. జాబితాను పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నామన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతున్న తపస్సు కాలాన్ని ఉపవాస ప్రార్థనలతో నిష్ఠగా నిర్వహించాలన్నారు. 40 రోజుల పాటు జరిగే ఉపవాస ప్రార్థనల్లో క్రైస్తవులందరూ బైబిల్ పఠనం చేయాలన్నారు. ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలకు గుర్తుగా చేస్తున్న తపస్సు కాలాన్ని పవిత్రంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపదేసి రాయి థామస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సీతానగరం: మండల గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు తెలిపారు. ఆయన సోమవారం ఉండేశ్వరపురంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ ఎంఎల్ అభ్యర్థిగా తాను పోటీలో ఉంటానన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి చిట్టిస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో అన్నదాతకు భరోసా

- జోరుగా సాగుతున్న నమోదు ప్రక్రియ
- ఈ నెల 15 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

అనపర్తి: రైతు సంక్షేమం, రైతు ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం విత్తు నుంచి పంట విక్రయం వరకూ ప్రతి దశలోనూ అన్నదాతకు అండగా నిలుస్తోంది. పంట సాగులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా సొంత గ్రామాల్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వం అందించే వ్యవసాయ సంబంధిత పథకాలు సక్రమంగా అన్నదాతలకు అందాలన్న ఉద్దేశంతో ఈ-క్రాప్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అధికారులు పూర్తి పారదర్శకంగా ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

అర్హులైన అన్నదాతలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ఈ-క్రాప్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులు ఏయే పంటలు ఎంతెంత విస్తీర్ణంలో సాగుచేశారు తదితర వివరాలను అధికారులు ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. పంట నమోదులో పొరపాట్లకు తావులేకుండా జియోఫెన్సింగ్ విధానంలో ఎంపిక చేసిన సర్వే నెంబర్‌లో సాగు చేసిన పొలంలోనే సంబంధిత రైతును నిలబెట్టి ఫొటో తీసి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వీఏఏ, వీహెచ్ఏల ద్వారా ఈ-క్రాప్ నమోదు నిర్వహిస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న ప్రతీ రైతుకు సంబంధించిన మొబైల్ నెంబర్‌కు మెసేజ్ రూపంలో డిజిటల్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ వెళుతుంది. ఈ విధానంతో కచ్చితమైన సమాచారం అందడంతో రైతులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అంది ప్రయోజనం చేకూరుతుంది. ఈ నెల 15వ తేదీ నాటికి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసేలా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

రైతులకు అందే ప్రయోజనాలు

రైతులు ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేసుకోవడం వల్ల అన్నదాతలు బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన పంటకు బీమా పరిహారం అందుతుంది. పంటకు గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు పొందే వీలుంటుంది. అదేవిధంగా పురుగుమందులు, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు, పెట్టుబడి సాయం మంజూరు వంటి ప్రయోజనాలు పొందవచ్చు. అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడి, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల పరిధిలో రబీ సీజన్‌లో మొత్తం 45,620 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటివరకూ 42,094 ఎకరాలు ఈ-క్రాప్‌లో నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఈ-కేవైసీ ప్రక్రియ 65 శాతం పూర్తయిందంటున్నారు.

అందరూ ఈ-క్రాప్ చేయించుకోవాలి



రైతులకు ప్రయోజనాన్ని చేకూర్చే ఈ-క్రాప్‌ను అన్నదాతలందరూ నమోదు చేయించుకోవాలి. ఈ-క్రాప్ నమోదుతో పాటు ఈ-కేవైసీ తప్పనిసరి. అప్పుడే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అన్నదాతలు పొందగలరు. ఈ నెల 15వ తేదీలోగా నూరు శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసేలా ప్రణాళికలను సిద్ధం చేశాం.

– బి.సురేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, అనపర్తి

జగన్ పాలనలో మహిళల అభ్యున్నతి

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో డ్వాక్రా మహిళల ఆర్థిక అభ్యున్నతి జరుగుతోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం గుమ్ములూరు సచివాలయంలో సోమవారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. మహిళలకు ఈ ప్రభుత్వం ప్రాధాన్యతిస్తోందన్నారు. సంక్షేమ పథకాలతో మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు ప్రయత్నిస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్, గుమ్ములూరు సర్పంచ్ నక్కా రాంబాబు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం జయంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెదపూడి: పెదపూడిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్పర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 22 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కాకినాడ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు పొందొచ్చని తెలిపారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కాటవరం వద్ద రోడ్డు పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆయన సోమవారం మండలంలోని ఉండేశ్వరపురం వద్ద బుచ్చింపేట – బొబ్బిల్లంక రోడ్డుకు, కాటవరం వద్ద కూనవరం – కాటవరం రోడ్డు పునర్నిర్మాణానికి, ఉండేశ్వరపురం వద్ద మైనర్ ఇరిగేషన్ పనులలో భాగంగా వంతెన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కాతేరు నుంచి చినకొండేపూడి వరకూ నాలుగు లైన్ల రోడ్డును రూ.104 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. ఉండేశ్వరపురం వద్ద బొబ్బిల్లంక – బుచ్చింపేట మూడు కిలోమీటర్ల పరిధిలోని రోడ్డును రూ.1.63 కోట్లతో, కాటవరం వద్ద కాటవరం– కూనవరం 2.8 కిలోమీటర్ల రోడ్డును రూ.1.52 కోట్లతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. మైనర్ ఇరిగేషన్ పనుల్లో భాగంగా ప్రభుత్వం నుంచి రూ.38 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఉండేశ్వరపురం వద్ద వరదల సమయంలో ప్రస్తుత కాజ్‌వే పూర్తిగా మునిగిపోవడం వల్ల రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో రూ.81.21 లక్షలతో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం మునికూడలికి చెందిన వెంపా వీర్రాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రాజా పరామర్శించారు. వీర్రాజు ఇటీవల మృతి చెందారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, ఉప సర్పంచ్ కోన రామకృష్ణ, ఎంపీటీసీలు మట్ట వెంకటరమణ, తాడేపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు.



ఉండేశ్వరపురం వద్ద వంతెనకు శంకుస్థాపన

వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్



సీతానగరంలో ఏర్పాటు చేసిన స్టాల్

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సహజ సిద్ధంగా పండించిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను వ్యవసాయశాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మండల రిసోర్స్ పర్సన్ ప్రవీణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.తాతారావు ఆధ్వర్యంలో సీతానగరం, చినకొండేపూడి, మునికూడలి, కూనవరం గ్రామాల్లో సుమారు 5 ఎకరాల్లో (కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫార్మింగ్) సహజ సిద్ధ పంటలు వేశామన్నారు. ఆ ఉత్పత్తులతో ప్రతి వారం మండల పరిషత్ కార్యాలయాల వద్ద స్టాల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్‌లు సుంకర శ్రీనివాస్, ఎస్.ప్రవీణ్ కుమార్, డివిజన్ ఎంటీ వరలక్ష్మి, నాగదేవి, ఎ.భవాని పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి



మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ శ్రీదేవి తదితరులు

రంగంపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్క సమస్యను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని, అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలన్నీ పరిష్కరించాలని ఎంపీపీ శ్రీదేవి అధికారులకు సూచించారు. అధికారులు తమ శాఖల అభివృద్ధిని సభలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు మట్టా శ్రీను, రాయుడు రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ ఎం.దొరకయ్య, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

300 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మండల కేంద్రం పెదపూడిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా 300 మంది పేదలు, వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, రాధిక దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పేదరికమే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ వారి అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పప్పు కల్పనాంజలి, పప్పు జోగారావు, నాగమణి, శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, కాకర సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు సువర్ణవేణికి విద్యారత్న అవార్డు



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సువర్ణవేణి

కడియం: స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయురాలు డాక్టర్ బూసి సువర్ణవేణి విద్యారత్న నేషనల్ అవార్డు 2024ను అందుకున్నారు. ఈ వివరాలను సోమవారం ఆమె స్థానిక విలేకరులకు తెలిపారు. సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 7వ నేషనల్ కాన్ఫరెన్స్ ఇటీవల తిరుపతిలో జరిగింది. ఈ కార్యక్రమంలో సువర్ణవేణిని పురస్కారంతో సత్కరించారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. విద్యారంగంలో ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా సువర్ణవేణిని స్కూల్ హెచ్ఎం సత్యనారాయణ, కార్యదర్శి జి.సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.లక్ష్మి, సిబ్బంది అభినందించారు.

గోదావరి ఘాట్లను సిద్ధం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు గోదావరి ఘాట్లను సిద్ధం చేయాలని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం స్థానిక కోటి లింగాల ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘాట్లలో మెట్లపై ఉన్న మట్టిని తొలగించాలని, మెట్ల దగ్గర నుంచి గోదావరి నీటి వరకూ సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మించాలన్నారు.

సాహిత్య చుక్కాని.. కళాగౌతమి

- కవులు, రచయితలకు ప్రోత్సాహం
- ప్రతి నెలా రెండో ఆదివారం సమావేశం



రచయితల సమితి సమావేశంలో మాట్లాడుతున్న బీవీఎస్ మూర్తి తదితరులు

సీటీఆర్ఐ: బంగారం పళ్లానికైనా గోడ చేర్పు అవసరం అన్న సామెత చందంగా ఎంత కవి అయినా, రచయిత అయినా ప్రోత్సహించేవారు లేకపోతే వారి ప్రతిభ వృథాగా మారుతుంది. కళాకారులకు కావాల్సిన చప్పట్లు లేకపోతే వారికి ఉత్సాహం రాదు. నలుగురూ తమ రచనలను, కవితలను మెచ్చుకుంటేనే వారి ఉత్సాహం రెట్టింపు అవుతుంది. పూర్వం రాజులు కళలు, సాహిత్యాలను ప్రోత్సహించేవారు. ప్రస్తుతం అది కనుచూపు మేరలో లేదు. అందువల్లనే కవులు, కళాకారులు తమకు తామే సంఘాలుగా ఏర్పడి, తమ ప్రతిభాపాటవాలను చాటుకుంటున్నారు.

సారస్వత రాజధాని

రాజమహేంద్రవరం తెలుగువారికి సారస్వత రాజధాని. కవిసార్వభౌములకు ఇది నిలయం. తెలుగునాట కవి సార్వభౌములుగా ప్రసిద్ధి చెందిన శ్రీనాథుడు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కూచిమంచి తిమ్మకవి.. ముగ్గురూ ఈ గోదావరి నీరు తాగిన వారే కావడం విశేషం. కానీ నేడు క్రమంగా గోదావరి తీరంలో కవులు, రచయతలు కనుమరుగవుతున్నారు. నగరంలో కొందరు పాత తరం వారు ఇంకా వారిలోని జిజ్ఞాసను కొనసాగిస్తూ నేటి తరానికి వారధిగా ఉంటున్నారు.

2004 రచయితల సమితి ప్రారంభం


రచయితలను ఒకచోట సమావేశ పరిచి, వారిని సమర్థులైన రచయితలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి 2004లో రాజమహేంద్రవరంలో రచయితల సమితిని ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరంగా ప్రతి రెండో ఆదివారం కవులు, రచయితలతో సమావేశం జరుగుతోంది. నగరంలోని రచనాసక్తి కలిగిన వారిని ఒకచోట చేర్చి, వారిని ప్రోత్సహించి, తప్పులను సరిచేసి చక్కని రచయితలుగా తయారు చేయడంలో కళాగౌతమి అవిశ్రాంతిగా పరిశ్రమిస్తోంది. తెలుగు రచయితల సమితి రెండు దశాబ్దాలుగా కవులను, రచయితలను ఒక్కచోటకు చేర్చి.. ప్రతి రెండో ఆదివారం కవి సమ్మేళనాలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, సమకాలీన అంశాలపై రచనలను దిగ్విజయంగా నిర్వహిస్తోంది. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక కవిత ప్రక్రియల్ని ప్రోత్సహిస్తూ, ముందుకు సాగుతున్న సంస్థగా దినదిన ప్రవర్ధమానం అవుతోంది.

రచయితల సమితికి నీడ లేదు

రచయితల సమితికి సరైన వేదిక లేదు. 2004లో పురమందిరంలో ప్రారంభించబడి, వివిధ వేదికలకు మారింది. సమరయోధుల పార్కు, దానవాయిపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల, అక్కడి నుంచి స్టేడియం వద్ద గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, ధర్మరచ కమ్యూనిటీ హాలు, రౌండ్ పార్కులోకి.. ఇలా పలుచోట్ల తిరిగి ఇప్పుడు ఎస్‌కేవీటీ కళాశాలలోని కందుకూరి నాటక నిలయం వద్దకు చేరుకున్నాం.

– బీవీఎస్ మూర్తి, కళాగౌతమి వ్యవస్థాపక అధ్యక్షుడు


కొత్త రచయితలకు వెన్నుదన్ను



కవిత్వాలు రాయాలి, రచనలు చేయాలని అనుకునే వారికి రచయితల సమితి ఒక వేదికగా నిలుస్తోంది. సాహిత్యానికి పుట్టినిల్లు అయిన రాజమహేంద్రవరంలో కవులకు, కళాకారులకు ఓ చక్కని వేదిక అందించాలని ఉద్దేశంతో ఈ రచయితల సమితిని ఏర్పాటు చేయడం జరిగింది. అక్షర జ్ఞానం, భాషాభిమానం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వేదికను ఉపయోగించుకోవాలి. వారి రచనలు, కవితలను, కళలను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి సరైన వేదిక ఇదే.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, కళాగౌతమి అధ్యక్షుడు

పండగ వాతావరణం



ప్రతి నెలా రెండో ఆదివారం ఎన్ని పనులున్నా రచయితల సమితి కార్యక్రమాలకు వెళ్లడానికి సిద్ధమవుతాం. ఎప్పుడెప్పుడు రెండో ఆదివారం వస్తుందా, కొత్త కవితలను, రచనలను వింటామా, వినిపిస్తామా అని మనసు తహతహలాడుతుంది. సమకాలీన అంశాలను ముందుగా తెలియజేసే కవులను సమావేశపరిచి కవి సమ్మేళనాన్ని జరిపించడం, అవధానాలు చేయించడం మరువలేని అనుభూతి. అది పండగ వాతావరణాని తలపిస్తుంది.

– డాక్టర్ బీహెచ్ రమాదేవి, రచయిత్రి

తోటి రచయితల నుంచి ప్రేరణ



కొత్తగా రచనలు చేసే వారితో పాటు, ప్రతిభావంతులైన కవుల వరకూ ఒక చోట చేరి, విశేషంగా సమకాలిన అంశాలపై స్పందిస్తూ తమ రచనలు వినిపించడం అభినందనీయం. అందరినీ ప్రోత్సహించడానికి, ఎదుగుదలకు ఏర్పర్చిన చక్కని సాహితీ వేదిక తెలుగు రచయితల సమితి. ఆ సమితి సభ్యుడిగా నేను పొందిన ప్రేరణ మరువలేనిది.

– ముంగటి సూర్యనారాయణ, కవి రచయిత